క్లుప్తంగా

దళిత సంఘాల ర్యాలీ



నెహ్రూనగర్: విజయవాడ పీడబ్ల్యూ గ్రౌండ్‌లో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమని సామాజికవేత్త గొల్లమూడి రాజేందర్‌బాబు పేర్కొన్నారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో పలు డిమాండ్ల పరిష్కారం కోరుతూ లాడ్జి సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అంబేద్కర్ విగ్రహ స్థాపన కోసం శంకుస్థాపన చేసి వదిలేసిందని విమర్శించారు. సబ్ ప్లాన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి, ఎస్సీల అభ్యున్నతికి కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కరెన్సీ నోటుపై అంబేద్కర్ బొమ్మను ముద్రించాలని రిజర్వ్ బ్యాంకును కోరారు.

ఐఎల్‌ఎం ఇంటర్వ్యూలో 57 మంది ఎంపిక



గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలోని జేకేసీ ఆధ్వర్యంలో శనివారం బెంగుళూరుకు చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ లాంగ్వేజ్ మేనేజ్‌మెంట్ (ఐఎల్‌ఎం) నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో వివిధ కళాశాలలకు చెందిన 57 మంది విద్యార్థిని, విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వి.ఆర్.జ్యోత్స్న కుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఇంగ్లిష్ లాంగ్వేజ్ ఫ్యాకల్టీగా ఎంపికైన విద్యార్థుల్ని ఆమె అభినందించారు. కార్యక్రమంలో ఐఎల్‌ఎం ప్రతినిధులతో పాటు జేకేసీ సమన్వయకర్త కె. అపర్ణ సీతారాం, మెంటార్లు యూనిస్ ఖాన్, అపర్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అలరించిన మహతి గానం



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదిపై గాయత్రీ మహిళా సంగీత సన్మండలి 26వ వార్షికోత్సవం శనివారం ప్రధాన కార్యదర్శి ఎం.వై.శేషురాణి ఆధ్వర్యంలో ప్రారంభమైంది. వడ్లమాని రాజ్యలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేశారు. సభకు ముఖ్య అతిథులుగా హిందూ ఫార్మసీ కాలేజీ చైర్మన్ జూపూడి రంగరాజు, డాక్టర్ కోపై రమణకుమార్, గుళ్లపల్లి సేవా సంస్థ వ్యవస్థాపకుడు గుళ్లపల్లి సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెన్నై చెందిన ఎస్. మహతి బృందం శాస్త్రీయ సంగీత కచేరీ వీనులవిందుగా సాగింది. అనంతరం అతిథులు, కళాకారుల్ని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమాల్ని కార్యదర్శి మంగాదేవి, ఉపాధ్యక్షులు పాటిబండ్ల లలిత, మాధవపెద్ది మీనాక్షి పర్యవేక్షించారు.


మెదడు రక్త నాళానికి బైపాస్ సర్జరీ

గుంటూరు మెడికల్: స్థానిక రమేష్ హాస్పిటల్‌లో మెదడు రక్తనాళానికి బైపాస్ సర్జరీ చేసి వృద్ధురాలి ప్రాణాలు కాపాడినట్లు చీఫ్ కార్డియాలజిస్టు డాక్టర్ పోతినేని రమేష్‌బాబు చెప్పారు. గుంటూరు మార్కెట్ సెంటర్‌లోని హాస్పిటల్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుంటూరుకు చెందిన వాసిరెడ్డి సుజాత అనే 69 సంవత్సరాల వృద్ధురాలికి మెదడుకు ఎడమ వైపు ఉండే రక్తాన్ని తీసుకెళ్లే ధమని 90 శాతానికి పైగా క్యాల్షియంతో పూడిపోయిందన్నారు. బైపాస్ ద్వారా సర్జరీ ద్వారా దాన్ని నివారించినట్లు ఆయన వివరించారు.

రేపు పిరమిడ్ ధ్యాన మందిరం వార్షికోత్సవం

కాకుమాను: స్థానిక శ్రీ ఆత్మలక్ష్మి పిరమిడ్ ధ్యాన మందిరం ఐదో వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం ఎనిమిది గంటలకు జ్యోతి ప్రజ్వలన అనంతరం తొమ్మిది గంటలకు తటవర్తి వీర రాఘవరావు, రాజ్యలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ధ్యానం, ఆత్మజ్ఞాన సందేశం ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం మహాకరుణ శాకాహార ర్యాలీ, ధాన్య మందిరం ప్రాంగణంలో మహా అన్న సంతర్పణ నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

మహిళ ఆత్మహత్య



గొడవర్రు(చేబ్రోలు): కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురైన మహిళ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చేబ్రోలు మండలం గొడవర్రులో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన దాసరి అనిత(44) కొద్ది రోజులుగా కుటుంబ సమస్యలతో సతమతమవుతోంది. శనివారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త చినవీరయ్య ఫిర్యాదు మేరకు చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శ్మశానవాటిక అభివృద్ధి అభినందనీయం

ఎమ్మెల్యే ముస్తఫా



ఫ్రీజర్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: పాత గుంటూరు హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు, స్థానిక కమిటీలు ముందుకు రావడం అభినందనీయమని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా తెలిపారు. పాత గుంటూరు హిందూ శ్మశానవాటిక అభివృద్ధి కమిటీ, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో శనివారం రెండు శీతలీకరణ బాక్సులను శ్మశానవాటికకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ శ్మశానవాటిక అభివృద్ధికి ప్రభుత్వం నుంచి రూ. 1.25 కోట్లు మంజూరు అయ్యాయని, వాటితో పాటు దాతలు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు అవ్వడం సంతోషదాయకమని తెలిపారు. మృతి చెందిన వారి కుటుంబసభ్యులు పాత గుంటూరు హిందూ శ్మశానవాటిక నిర్వాహకుల్ని సంప్రదించి మృతదేహాలను నిల్వ ఉంచేందుకు ఫ్రీజర్లను తీసుకు వెళ్లవచ్చని చెప్పారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పావులూరి రమేష్, రామారావు, రమణబాబు, గురవారెడ్డి, ఉమామహేశ్వరరావు, కార్పొరేటర్ మెహమూద్, స్థానిక కమిటీ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి, ఆదినారాయణరెడ్డి, భాస్కర్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

భవిష్యత్ అంచనాలకు చరిత్ర దోహదం

- ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్
- చరిత్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు ప్రారంభం



చరిత్ర సమావేశంలో ప్రసంగిస్తున్న వీసీ రాజశేఖర్

ఏఎన్‌యూ: భవిష్యత్ అంచనాలకు చరిత్ర దోహదం చేస్తుందని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ పేర్కొన్నారు. నాగార్జున యూనివర్సిటీ హిస్టరీ, ఆర్కియాలజీ విభాగం ఆధ్వర్యంలో 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ద ప్రీ హిస్టారిక్ రీసెర్చ్ ఇన్ ఇండియా' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సును శనివారం వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ చరిత్ర అధ్యయనం వర్తమాన సమస్యలకు పరిష్కారం చూపుతుందన్నారు. యువత భవిత, మేలైన నడతకు చరిత్ర దోహదం చేస్తుందన్నారు. బ్రిటిష్ వాళ్లు వచ్చే వరకూ భారతీయులకు దేశం అంతా ఒక్కటే అనే భావన లేదని, వాళ్లు వచ్చి మన దేశ చరిత్రను అధ్యయనం చేసిన తర్వాత మాత్రమే భారతీయులకు చరిత్ర ప్రాముఖ్యత తెలిసిందని తెలిపారు. ఆర్కియాలజీ రంగానికి ఆర్ట్స్ కంటే సైన్స్‌తో ఎక్కువ సంబంధం ఉందని చెప్పారు. రెక్టార్ ఆచార్య వరప్రసాద మూర్తి ప్రసంగిస్తూ చరిత్ర అతి ముఖ్యమైందన్నారు. పాండిచ్చేరి విశ్వవిద్యాలయ ప్రతినిధి ఆచార్య ఎస్.చంద్రమౌళి ప్రసంగిస్తూ ప్రపంచంలో ప్రీ హిస్టరీ అనేది సైన్స్‌తో సంబంధించిన అంశమని తెలిపారు. ఏఎన్‌యూలో ఎంఏ ఆర్కియాలజీ చదవడం ద్వారా అనేక విషయాలు నేర్చుకున్నానన్నారు. కర్ణాటక విశ్వవిద్యాలయ అధ్యాపకులు ఆచార్య రవీంద్ర కొరిసెట్టర్ కీలకోపన్యాసం చేస్తూ చరిత్రతో పాటు మన దేశంలో చారిత్రాత్మక ప్రాంతాలకు ఎంతో విశిష్టత ఉందని వివరించారు. దాన్ని భావితరాలకు పదిలంగా అందజేయాల్సిన బాధ్యత హిస్టరీ, ఆర్కియాలజీ రంగ నిపుణులపై ఉందని సూచించారు. కార్యక్రమంలో సదస్సు డైరెక్టర్ ఆచార్య ఎస్. మురళీమోహన్, హిస్టరీ విభాగ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని చినకాకాని ఎన్నారై వైద్య కళాశాల సైక్రియాటిక్ విభాగ అధ్యాపకుడు డాక్టర్ ఫణిభూషణ్ తెలిపారు. నాగార్జున యూనివర్సిటీ సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో 'ప్రస్తుత సమాజంలో యువత ఎదుర్కొంటున్న సవాళ్లు, వాటి నిర్మూలనా విధానాలు' అనే అంశంపై ఏఎన్‌యూ సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగిన జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఫణిభూషణ్ ప్రసంగిస్తూ జీవితంలో ఎదరయ్యే అపజయాల్ని జయిస్తే యువత అద్భుతాల్ని సృష్టించవచ్చని తెలిపారు. వ్యవసనాలకు బానిసలై విలువైన జీవితాలను బలి చేసుకోవద్దని చెప్పారు. యువతకు తల్లిదండ్రుల నైతిక మద్దతు కూడా ఎంతో అవసరమన్నారు. యోగి వేమన యూనివర్సిటీ సైకాలజీ విభాగాధిపతి ఆచార్య లలిత ప్రసంగిస్తూ నేటి సమాజంలో యువత అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, వాటిని ఆత్మవిశ్వాసంతో పరిష్కరించుకోవాలని సూచించారు. సైకాలజిస్ట్ డాక్టర్ విశేష్ ప్రసంగిస్తూ యువతకు తమపై తమకు ఆత్మవిశ్వాసం కలిగేలా సామాజిక పరిస్థితులపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య బి. నాగరాజు అధ్యక్షోపన్యాసంతో పాటు నివేదికను సమర్పించారు. ఇగ్నో అధ్యాపకుడు బి.ప్రసాద్‌బాబు, ఏఎన్‌యూ సైకాలజీ విభాగ అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ వసంతరావు, అధ్యాపకులు అనుపమ, పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. సదస్సులో పరిశోధన పత్రాలు సమర్పించిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

సామాజిక ఉద్యమాల పితామహుడు పూలే

భారతదేశంలో సామాజిక ఉద్యమాలకు పితామహుడు మహాత్మా జ్యోతిరావ్ పూలే అని రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి తెలిపారు. నాగార్జున యూనివర్సిటీ మహాత్మా జ్యోతిరావ్ పూలే అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో 'అబ్రోగేషన్ ఆఫ్ క్లాస్ అండ్ కాస్ట్ అప్రెషన్ ఇన్ ఇండియా: కాంట్రిబ్యూషన్స్ ఆఫ్ మహాత్మా జ్యోతిరావ్ పూలే' అనే అంశంపై రెండు రోజులపాటు జరిగిన జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు ముఖ్య అతిథిగా హాజరైన రెక్టార్ ప్రసంగిస్తూ సమాజంలో అసమానతలు రూపుమాపేందుకు పూలే దంపతులు చేసిన కృషి ఎప్పటికీ ఆదర్శనీయమని తెలిపారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య ఎం. త్రిమూర్తిరావు అధ్యక్షోపన్యాసం చేస్తూ రెండు రోజులపాటు జరిగిన సదస్సులో దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల అధ్యాపకులు, పూలే తత్వవేత్తలు హాజరై పరిశోధనా పత్రాలు సమర్పించారని తెలిపారు. నల్గొండ మహాత్మాగాంధీ యూనివర్సిటీ పాలకమండలి సభ్యుడు డాక్టర్ కోయి కోటేశ్వరరావు ప్రసంగిస్తూ విద్యతోనే సమాజంలో రుగ్మతలు, వివక్షతలు తొలగిపోతాయని పూలే దంపతులు బలంగా నమ్మారని పేర్కొన్నారు. ఐపీఎస్ అధికారి షరీమా బేగం, పూలే అధ్యయన కేంద్రం మాజీ డైరెక్టర్ ఆచార్య అబ్దుల్ నూర్ బాషా, మహిళా అధ్యయన కేంద్రం కో-ఆర్డినేటర్ ఆచార్య శాంతిశ్రీ, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఆచార్య రవిశేఖర్ ప్రసంగించారు. సదస్సులో పరిశోధనా పత్రాలు సమర్పించిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. పలువురు అధికారులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వకవి భావుకతకు దర్పణం 'శ్యామ' కవితా సంపుటి



పుస్తకావిష్కరణలో పాల్గొన్న శివశంకర్ తదితరులు

పాత గుంటూరు: విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ భావుకతకు 'శ్యామ' కవితా సంపుటి దర్పణమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ పేర్కొన్నారు. బృందావన్ గార్డెన్స్‌లోని ధార్మిక విజ్ఞాన పరిషత్ హాలులో శనివారం రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన 'శ్యామ' ఆంగ్ల కవితా సంపుటిని అదే పేరుతో జయ చాముండేశ్వరి పబ్లికేషన్స్ సౌజన్యంతో తెలుగులో కందిమళ్ల శివప్రసాద్ అనువదించిన గ్రంథాన్ని శివశంకర్ ఆవిష్కరించారు. కవి కాట్రగడ్డ దయానంద్ మాట్లాడుతూ 13వ ఏటనే కవిత్వం రాయడం మొదలుపెట్టి ఖండాంతరాలు తన ఖ్యాతిని విస్తరించిన విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ అని వివరించారు. కార్యక్రమంలో భూసురపల్లి వెంకటేశ్వర్లు, రావి రంగారావు, ప్రజాసాహితి దివికుమార్, కవి శ్రీరామ కవచం సాగర్, రావెల సాంబశివరావు, చెరుకూరి సత్యనారాయణ, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి కె.జి.శంకర్, పలువురు సాహితీవేత్తలు, కవులు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

ముగిసిన తిరుపతమ్మ తిరునాళ్ల



పాత గుంటూరు: కొరిటిపాడు ఆంజనేయపేట శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యస్వామి తిరునాళ్ల మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. ఉత్సవమూర్తులకు శనివారం ఉదయం పంచామృతాలతో అభిషేకం, అలంకార పూజ తదితర కార్యక్రమాల్ని వేద పండితులు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాల్ని ఆలయ నిర్వాహకులు కన్నసాని విజయకుమార్, రవి కుమార్, బాజీ పర్యవేక్షించారు.

జైమిని భారతం గ్రంథావిష్కరణ



గ్రంథ ఆవిష్కరణలో సోమయాజులశర్మ, బాలచందర్, సత్యనారాయణ తదితరులు

పాత గుంటూరు: లక్ష్మీపురంలోని శ్రీ త్యాగరాజ సాంస్కృతిక కేంద్రంలో ఆజోవిభో కందాళం ఫౌండేషన్, సంస్కృతి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం జైమిని భారతం గ్రంథాన్ని ఆవిష్కరించారు. సభకు ఫౌండేషన్ ఆచార్య అప్పాజోశ్యుల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా గరిమెళ్ల అచ్యుత సత్యశేషగిరి సోమయాజులుశర్మ పాల్గొని గ్రంథాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సారస్వత కళానిధి డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి, కడలి రాధాకృష్ణ, సంస్కృతి సమ్రాజు బాలచందర్ పాల్గొన్నారు. వ్యాఖ్యాతలుగా రామకృష్ణ, సూర్యనారాయణ, సత్యసూర్యనారాయణమూర్తి వ్యవహరించారు.

విజ్ఞాన్ నిరుల అధ్యాపకుడికి డాక్టరేట్



గుంటూరు రూరల్: పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరుల కళాశాల అధ్యాపకుడు రావిపాటి శ్రీకాంత్‌కు విజ్ఞాన్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆయన పెర్ఫార్మెన్స్ అనాలసిస్ ఆఫ్ హైబ్రిడ్ పవర్డ్ వెహికల్ బై అడాప్టింగ్ డిఫరెంట్ ఎంపీపీ టెక్నిక్స్ విత్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ అనే అంశంపై వై. శ్రీనివాసరావు, ఎం. వెంకటేష్‌ల పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.రాధిక, అధ్యాపకులు శ్రీకాంత్‌ను అభినందించారు.

పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



సామగ్రి పంపిణీ చేస్తున్న మేరి, రాధ తదితరులు

గుంటూరు రూరల్: విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని భావిస్తూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాల్ని అమలు చేస్తున్నారని ఆర్ అండ్ బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి తెలిపారు. అడవితక్కెళ్లపాడులోని అంబేద్కర్ బాలుర హస్టల్‌లో శనివారం సెల్లో సంస్థ ఎగ్జిక్యూటివ్ కె. రాజు, రావెల నల్లయ్య, హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, పెన్నులు, పెన్సిల్స్, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేరి మాట్లాడుతూ జీవితంలో సమయం వృథా చేసుకుంటే తిరిగి రాదని చెప్పారు. శ్రద్ధతో వేసే ప్రతి అడుగూ విజయానికి కారణమవుతుందని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మాటల్ని శ్రద్ధగా విని ఉన్నత లక్ష్యాలతో చదువుకుని ఉజ్వల భవిష్యత్తును పొందాలని సూచించారు. వైఎస్సార్ సీపీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు దుంపాల రాధ మాట్లాడుతూ క్రమశిక్షణతో ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకోవాలన్నారు. విద్య ద్వారానే ఉన్నత స్థానాలు సాధించగలరని చెప్పారు. సమయపాలన పాటిస్తూ పరీక్షల కోసం చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, జిల్లా మహిళ అధ్యక్షురాలు లక్ష్మి, ఉపాధ్యాయులు నాగభూషణం, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

గుంటూరు రూరల్: తల్లిదండ్రులు మందలించారని విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లపాడు గ్రామానికి చెందిన యనమల వేళంగిణిరాజు కుమారుడు లాజరస్ (14) నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. రెండు రోజులుగా పాఠశాలకు వెళ్లడం లేదని, చదవడం లేదని లాజరస్‌ను తల్లిదండ్రులు మందలించారు. దీంతో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

మార్చురీలో పది రోజులుగా వ్యక్తి మృతదేహం



కన్యకాపరమేశ్వరి ఆలయం సమీపంలో వ్యక్తి మృతదేహం

పట్నంబజారు: ఓ వ్యక్తి మృతదేహం పది రోజులుగా మార్చురీలో ఉందని, బంధువులు ఎవరైనా ఉంటే సమాచారం అందించాలని పోలీసులు కోరారు. లాలాపేట పోలీసుస్టేషన్ ఎస్ఐ అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పది రోజుల కిందట ఏటుకూరు రోడ్డులోని కన్యకాపరమేశ్వరి ఆలయం సమీపంలోని ఇసుక వారి వీధిలో వ్యక్తి మృతి చెందినట్లు సమాచారం అందిందని తెలిపారు. మృతుడి వద్ద ఉన్న ఆధార్ కార్డులో పఠాన్ ఉమర్‌ఖాన్, పాత పోలీసులైన్, లాలాపేట అని ఉందని చెప్పారు. అయితే ఆ అడ్రస్‌లో ఆరా తీయగా మృతుడి బంధువులు ఎవరూ లేనట్లు తెలిసిందన్నారు. మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు ఎవరైనా ఉంటే ఫోన్ నంబర్ 9701013508కు సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులకు ప్రేరణ



సైన్స్ ఎక్స్‌పో ప్రారంభిస్తున్న ఎంఈవో అబ్దుల్ ఖుద్దూస్

గుంటూరు ఎడ్యుకేషన్: భావి శాస్త్రవేత్తలుగా ఎదగడంలో వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తాయని గుంటూరు ఎంఈవో అబ్దుల్ ఖుద్దూస్ పేర్కొన్నారు. బృందావన్ గార్డెన్స్‌లోని ఆక్స్‌ఫర్డ్ ఐఐటీ స్కూల్లో శనివారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పోను అబ్దుల్ ఖుద్దూస్, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో ఖుద్దూస్ మాట్లాడుతూ వైజ్ఞానిక శాస్త్రాలపై అవగాహన పెంచుకుని, శాస్త్రవేత్తలుగా రాణించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లాలని విద్యార్థులకు సూచించారు. సీతారామాంజనేయులు మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దేశాన్ని అగ్రగామిగా చేసేందుకు విద్యార్థుల్ని శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాల్సిన అవసరముందన్నారు. ఇందుకు విద్యాసంస్థలు కీలకపాత్ర పోషించాలని తెలిపారు. ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఎస్. ఫ్రాన్సిస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించేందుకు గత 24 ఏళ్లుగా ఖర్చుకు వెనుకాడకుండా భారీస్థాయిలో వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వివిధ అంశాల సమాహారంగా ప్రాజెక్టుల్ని ప్రదర్శిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎస్. అరోన్‌రెడ్డి, డైరెక్టర్లు ఎస్. విజయ్‌భాస్కర్ రెడ్డి, ఆరోగ్య జోసఫ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అమీనాబేగం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్డియాక్ అరెస్ట్‌పై అప్రమత్తత అవసరం



కార్డియాక్ అరెస్ట్ గురించి వివరిస్తున్న డాక్టర్ షకూర్

గుంటూరు ఎడ్యుకేషన్: కార్డియాక్ అరెస్ట్‌పై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని రమేష్ హాస్పిటల్స్ అత్యవసర కేసుల వైద్య నిపుణుడు డాక్టర్ షకూర్ సూచించారు. చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో శనివారం రమేష్ హాస్పటల్స్ సహకారంతో కార్డియాక్ అరెస్టు సంభవించినప్పుడు తక్షణమే తీసుకోవాల్సిన చర్యలపై బేసిక్ లైఫ్ సపోర్ట్ ప్రోగ్రాం ద్వారా ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ షకూర్ మాట్లాడుతూ ఆధునిక జీవితంలో మద్యం, ధూమపానం, ఫాస్ట్‌ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం, వంశ పారంపర్యం, ఒత్తిడి వంటి కారణాలతో ఎక్కువ మంది గుండె జబ్బుల బారిన పడుతున్నారని వివరించారు. మొదట్లోనే వీటిని గుర్తించి జాగ్రత్తలు తీసుకోవడం వల్ల రాబోవు ముప్పును నివారించుకోవచ్చని తెలిపారు. కార్డియాక్ అరెస్టు సంభవించినప్పుడు మెదడుకు రక్త ప్రసరణ ఎంతో ముఖ్యమని చెప్పారు. సీపీఆర్ చేయడం ద్వారా వ్యక్తి ప్రాణాల్ని ఏ విధంగా కాపాడవచ్చో పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ప్రత్యక్ష విధానంలో చూపించారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ ఇటీవల కార్డియాక్ అరెస్ట్ అనేది వేగంగా సంభవిస్తోందని, దీన్ని నివారించేందుకు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రమేష్ హాస్పిటల్స్ బ్రాండింగ్ హెడ్ సునీత, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులు లక్ష్యసాధన దిశగా కృషి చేయాలి



రంగనాయకిని సత్కరిస్తున్న జూపూడి రంగరాజు, నాగభూషణం, తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థినులు లక్ష్యసాధన దిశగా కృషి చేసి, జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని శారదానికేతన్ ఓరియెంటల్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ శ్రీరంగనాయకి సూచించారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో శనివారం నిర్వహిచిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఇతిహాసాల్లో లక్ష్మి, సరస్వతి, పార్వతీదేవి చరిత్ర తెలుసుకుని, వారి నుంచి స్ఫూర్తి పొందాలని సూచించారు. ఎంచుకున్న రంగంలో ఓర్పు, నేర్పు అలవర్చుకుని సాంకేతిక విద్యతో విజయం సాధించాలని పేర్కొన్నారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ ఎంతో మంది వీర మహిళల పోరాట పటిమ, విజయ గాథలతో ఆవిర్భవించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని అదే స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించడం ద్వారా దేశాభివృద్ధికి పాటు పడాలన్నారు. కార్యక్రమంలో టీజేపీఎస్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ టి. రాధాబాయి, బోటనీ పూర్వ హెచ్ఓడీ డి. సోమేశ్వరి, కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ కె. రవికుమార్, ఫార్మా.డి డైరెక్టర్ పి. సీతారామయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థుల భవితకు సమష్టిగా కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఉర్దూ డీఐ ఖాసిం

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి విద్యార్థుల ఉజ్వల భవితకు ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని ఉర్దూ డీఐ షేక్ మొహమ్మద్ ఖాసిం తెలిపారు. చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో శనివారం విద్యాశాఖ ఆదేశాల మేరకు టెన్త్ విద్యార్థినులు, తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఖాసిం మాట్లాడుతూ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతి విద్యార్థులకు అనేక సౌకర్యాలు కల్పిస్తూ ప్రథమ స్థానంలో ఉత్తీర్ణతకు కృషి చేస్తోందని తెలిపారు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని కష్టపడి చదివి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణులు అయ్యేందుకు కృషి చేయాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి.విజయలక్ష్మి మాట్లాడుతూ ఉపాధ్యాయులు సూచించిన సలహాలు పాటిస్తూ వారి సహకారంతో పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు.

పీజీ విద్యార్థులకు ఐఎస్‌పీ ద్వారా రీసెర్చ్ గ్రాంటు

ప్రెసిడెంట్ డాక్టర్ అభయ్ కోల్టే



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఐఎస్‌పీ ప్రెసిడెంట్ డాక్టర్ అభయ్ కోల్టే

పెదకాకాని: పీజీ విద్యార్థులకు ఇండియన్ సొసైటీ ఆఫ్ పెరియోడాంటాలజీ (ఐఎస్‌పీ) ద్వారా రీసెర్చ్ గ్రాంట్లు మంజూరు చేస్తామని ప్రెసిడెంట్ డాక్టర్ అభయ్ కోల్టే హామీ ఇచ్చారు. మండలంలోని తక్కెళ్లపాడు సిబార్ దంత వైద్య కళాశాలలో శనివారం రెండు రోజుల జాతీయస్థాయి చిగుళ్ల వ్యాధుల అవగాహన సదస్సు ప్రారంభమైంది. ముఖ్య అతిథులుగా ఇండియన్ సొసైటీ ఆఫ్ పెరియోడాంటాలజీ(ఐఎస్‌పి) ప్రెసిడెంట్ డాక్టర్ అభయ్ కోల్టే, సెక్రటరీ డాక్టర్ హర్‌ప్రీత్ సింగ్ గ్రోవర్ పాల్గొన్నారు. సదస్సుకు దేశంలోని దంత వైద్య కళాశాలల నుంచి 300 మంది పీజీ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ అభయ్ కోల్టే మాట్లాడుతూ ఐఎస్‌పీ ద్వారా పరిచయ్, ఇంటిగ్రేట్, టీచర్స్ ట్రైనింగ్ ప్రోగ్రాం వంటి ఎన్నో కార్యక్రమాల్ని దేశం నలుమూలల నిర్వహిస్తున్నామని తెలిపారు. సిబార్ కళాశాల డీన్ డాక్టర్ ఎల్. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు ఐఎస్‌పీ పరిచయ్ అవగాహన సదస్సును సిబార్ దంత వైద్య కళాశాలలో నిర్వహించడానికి అనుమతి ఇచ్చిన ఆఫీసు బేరర్స్‌ను అభినందించారు. భవిష్యత్తులో కూడా ఐఎస్‌పీ ద్వారా జరిగే మరిన్ని కార్యక్రమాలకు సిబార్ దంత వైద్య కళాశాల వేదికగా ఉంటుందని సభాముఖంగా హామీ ఇచ్చారు. సదస్సులో ఐఎస్‌పీ ఈసీ మెంబర్స్ డాక్టర్ ఆశిష్‌జైన్, డాక్టర్ ఆశిష్ నిదాని, పలు రాష్ట్రాల నుంచి 10 మంది వక్తలు హాజరయ్యారు. కార్యక్రమంలో ఐఎస్‌పీ పరిచయ్ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ డి. రవీంద్రనాథ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బి. రామనారాయణ, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, సిబార్ డైరెక్టర్ డాక్టర్ పి. కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ డాక్టర్ బి. వి. రమణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.